# నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, బుధవారం 19 జూన్ 2024 | RANGAREDDY


## 23న మెగా జాబ్ మేళా



జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి హన్మంత్‌రావు

వికారాబాద్, జూన్ 18 : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గౌలికర్ నర్సింగ్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు మెగా జాబ్‌మేళా జరుగుతుందని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి హన్మంత్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాకు సుమారు 60పైగా కంపెనీల ప్రతినిధులు హాజరవుతా రని.. దాదాపు ఎనిమిది వేలకు పైగా వివిధ కేటగిరీల్లో ఉద్యోగాల ఖాళీలున్నాయ న్నారు. ఐటీఐ, డిప్లొమా, హోటల్ మేనేజ్‌మెంట్, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంబీఏ, ఇంజినీరింగ్ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులైన 18 నుంచి 35 ఏండ్లలోపు యువతీ యువకులు పాల్గొనవచ్చన్నారు. రెజ్యూమె, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో ఉదయం 9 గంటల్లోపు హాజరు కావాలన్నారు.





# వరుణ దేవుడా..

# కరుణించు..

## రంగారెడ్డి జిల్లాలో సాధారణ వర్షపాతమే నమోదు

- 13 మండలాల్లో ఆశించిన స్థాయిలో కురవని వానలు
- సీజన్ ఆరంభంలోనే కలిసి రాని కాలం
- కలవరపడుతున్న అన్నదాత.. ఊపందుకోని ఎవుసం
- సరైన వర్షాలు లేకుంటే మళ్లీ విత్తుకోవాల్సిందే..

రంగారెడ్డి, జూన్ 18(నమస్తే తెలంగాణ) : ఈ సీజన్‌లో సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ శాస్త్రవేత్తలు అంచనా వేసినా.. జిల్లాలో మా త్రం ఆశించిన స్థాయిలో వానలు కురవడంలేదు. నగరాల్లో భారీగా కురుస్తున్న వర్షం.. గ్రామీణ ప్రాంతాల్లో ఉండడం లేదు. ఫలితంగా వానకాలం సీజన్ పనులు నేటికీ ఊపందుకోలేదు. ఇంకా చాలామంది రైతులు విత్తనాలు వేసే సాహసం చేయలేక.. పునరాలోచనలో పడ్డారు. ఇప్పటికే విత్తనాలు వేసిన వారు..ఆందోళన చెందుతున్నారు. సీజన్ ప్రారంభంలోనే కాలం కలిసి రాకపోవడంతో జిల్లా రైతాంగం కలవరపడుతున్నది.



కురిసిన సాధారణ వర్షపాతానికి మాడ్గుల మండలంలోని ఓ గ్రామంలో మొలకెత్తిన పత్తి విత్తనాలు

### దిగుబడులపై ప్రభావం..

రైతులు ఏప్రిల్, మే నెలల్లోనే దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో మే చివరి వారంలోనే పత్తి వంటి విత్తనాలను విత్తుకోగా..మరికొన్ని ప్రాంతాల్లో జూన్ మొదటి వారంలో విత్తనాలు నాటారు. ఆశించిన స్థాయిలో వర్షా లు లేక కొన్ని మొలకలు రాకపోగా..కొన్ని చోట్ల మొలక శాతం చాలా తక్కువగా ఉన్నది. ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 4,45,428 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పం టలను సాగు చేస్తారని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేసింది. అందులో అత్యధికంగా పత్తి 1,76,174 ఎకరాల్లో, వరి 1,38,187 ఎకరాల్లో, మొక్కజొన్న 66, 530 ఎకరాల్లో రైతులు సాగు చేయనున్నారు. జూన్ మొదటి వారంలోనే పంటల సాగు పనులు ముమ్మరం కావాల్సి ఉండగా.. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటివరకు భారీ వర్షం నమోదు కాకపోవడం..ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వారం రోజుల్లో సమృద్ధిగా వర్షాలు కురవని పక్షంలో పత్తి విత్తనాలను మరోసారి నాటుకోవాల్సి వస్తుందని , ప్రస్తుత పరిస్థితుల ప్రభావం దిగుబడులపై పడనున్నదని రైతులు పేర్కొంటున్నారు.

విత్తుకునేందుకు మరికొంత సమయమున్నా ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వానలు కురవని పక్షంలో గత యాసంగి పరిస్థితులే పునరావృతమవుతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

### చాలా చోట్ల.. లోటు వర్షపాతమే ..

జూన్‌లో మొత్తం 94 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా ఇప్పటివరకు 68.5 మి.మీల మేర సాధారణ వర్షపాతమే నమోదైంది. ఈ క్రమంలో జిల్లాలో 13 మండలాల్లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడం ఆందోళన కలిగిస్తున్నది.

### అధిక వర్షపాతం నమోదైన మండలాలు

కొందుర్గు, మొయినాబాద్, కడ్తాల్, కేశంపేట, తలకొండపల్లి, ఆమనగల్లు, మాడ్గుల, శంకర్‌పల్లి, శేరిలింగంపల్లి, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్ మెట్, హయత్‌నగర్, సరూర్‌నగర్

### సాధారణ వర్షపాతం నమోదైన మండలాలు

గండిపేట, రాజేంద్రనగర్, బాలాపూర్, మహేశ్వరం, చేవెళ్ల, నందిగామ, ఫరూక్‌నగర్

**లోటు వర్షపాతం :** యాచారం, కందుకూరు, షాబాద్, చౌదరిగూడెం

**అత్యల్ప వర్షపాతం :** శంషాబాద్, కడ్తాల్



# కొత్త పద్ధతులతో..

# కబ్జాలకు చెక్



### మైల్వార్‌లో 200 ఎకరాలు స్వాధీనం..

తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన బషీరాబాద్ మండలంలోని మైల్వార్ రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో వివాదం నెలకొన్నది. మైల్వార్ రిజర్వ్ ఫారెస్ట్‌కు సంబంధించిన సుమారు 200 ఎకరాల అటవీ భూములను గత కొన్నేండ్లుగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన రైతులు కబ్జా చేసి సాగు చేసుకుంటుండగా స్థానిక రైతులు, ప్రజల ఫిర్యాదు మేరకు జిల్లా అటవీ శాఖ అధికారులు ఆ భూములను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ విషయంపై కర్ణాటక రైతులు గుల్బర్గా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఆయన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో మాట్లాడినట్లు తెలిసింది. అయితే గుల్బర్గా జిల్లాకు చెందిన రెవెన్యూ, సర్వే అధికారులు మాత్రం కర్ణాటక సరిహద్దులోని భూములనే మా రాష్ట్ర రైతులు సాగు చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. అయితే సరిహద్దు వివాదానికి చెక్ పెట్టేందుకు త్వరలో అక్కడ జాయింట్ సర్వే చేయనున్నారు.

### అటవీ సంపదను కాపాడుకోవాలి..



అటవీ భూములను కబ్జా చేయడం చట్టరీత్యా నేరం. ఫారెస్టు భూములను కబ్జా చేసి చెట్లను నరుకుతూ రుజువులతో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు. గ్రామస్తులు కూడా అటవీ సంపదను కాపాడుకోవాలి.

– జ్ఞానేశ్వర్, వికారాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి

జిల్లాలో అటవీ భూముల సంరక్షణకు ఆ శాఖ అధికారులు చర్యలను ముమ్మరం చేశారు. ఫారెస్టు ల్యాండ్స్ కబ్జా కాకుండా ఫెన్సింగ్, కందకాలు ఏర్పాటు చేయడంతోపాటు కబ్జా అయిన ప్రాంతాల్లో మొక్కలు నాటాలని నిర్ణయించారు. అయితే గతంలో అటవీ భూములను కబ్జా చేసిన వారిపై పీవోఆర్(ప్రాథమిక నేర పత్రం) పూర్తి చేసి కేసులు పెట్టేవారు. దీంతో కోర్టుల చుట్టూ తిరగడంతో కాలయాపన జరిగేది. కబ్జా చేసిన భూముల్లో సాగు చేసుకునే పరిస్థితి ఉండేది. అయితే ఈ విధానంతో అటవీ భూముల కబ్జాలు పెరుగుతున్న దృష్ట్యా పీవోఆర్‌తోపాటు కబ్జా చేసిన ప్రాంతాల్లో మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఎక్కడైతే అటవీ భూమి కబ్జా జరిగిందో సంబంధిత గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించి తీర్మానం చేసి కబ్జాకు పాల్పడిన అటవీ భూముల్లో మొక్కలను నాటుతున్నారు. ఒకవేళ కబ్జా చేసిన అటవీ భూముల్లో మొక్కలు నాటేందుకు అక్కడి స్థానికులు అంగీకరించకుంటే కబ్జాకు గురైన అటవీ భూములన్నింటినీ కలిపి అధికారులు ఫెన్సింగ్, కందకాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల జిల్లాలోని యాలాల మండలంలోని బానాపూర్‌లో 2.20 ఎకరాలు, ధారూరు మండలంలోని దోర్నాలలో 5 ఎకరాల కబ్జా అయిన భూములను అధికారులు స్వాధీనం చేసుకొని మొక్కలు నాటారు. జిల్లాలో 1.12 లక్షల ఎకరాల్లో అటవీ భూములుండగా కొంతమేర కబ్జా అయినట్లు వారు పేర్కొంటున్నారు. కబ్జాదారులు ప్రతిఏటా కొంత.. కొంత అటవీ భూమిని దున్నుతూ సాగు భూమిగా మార్చుకుంటున్నారు. వికారాబాద్ జిల్లాలో 95 బ్లాకులు... 44 వేల హెక్టార్లలో అటవీ భూములున్నాయి.

-వికారాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ)

### ఫారెస్టు ల్యాండ్స్ సంరక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు

- అన్యాక్రాంతమైన భూముల స్వాధీనం.. మొక్కలు నాటేలా ప్లాన్, కందకాలు, ఫెన్సింగ్ ఏర్పాటు
- వికారాబాద్ జిల్లాలో 95 బ్లాకులు.. 44 వేల హెక్టార్లలో అటవీ భూములు

### ఆరువేల ఎకరాల్లో అటవీ భూములు కబ్జా..

జిల్లాలో అధిక మొత్తంలో అటవీ భూములు అన్యాక్రాంతమయ్యాయి. జిల్లాలోని ప్రధానమైన దామగుండం, మర్పల్లి, కండ్లపల్లి, గట్‌కొండాపూర్, నాగారం, తిర్మలాపూర్, నజీరాబాద్, మహ్మదాబాద్, మైల్వార్, అడికిచెర్ల తదితర ప్రాంతాల్లోని వందల ఎకరాల అటవీ భూములు కబ్జాకు గురయ్యాయి. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్, ధారూరు రేంజ్‌ల పరిధుల్లో సుమారు ఆరు వేల ఎకరాల అటవీ భూములు అన్యాక్రాంతమయ్యాయి. అయితే ధారూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని దొర్నాల్ ప్రాంతంలో దాదాపు వెయ్యి ఎకరాలకుపైగా, కొడంగల్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో దాదాపు 2 వేల ఎకరాల వరకు, వికారాబాద్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అనంతగిరిలో 100 ఎకరాలు, మదన్‌పల్లిలో వెయ్యి ఎకరాలు, ఎక్‌మామిడి, పుల్‌మామిడిలలో 500 ఎకరాలకుపైగా.. వికారాబాద్, పరిగి, ధారూరు ఫారెస్ట్ రేంజ్‌ల పరిధుల్లోని అటవీ భూముల్లో పలు ఫామ్ హౌస్‌లు, రిసార్టులు వెలిసినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఆ భూములను తిరిగి అధికారులు స్వాధీనం చేసుకోకుండా తప్పుడు పత్రాలతో వాటి నిర్వాహకులు కోర్టులకెళ్తూ.. వాటిని తమ కబ్జాలోనే ఉండేలా వ్యవహరిస్తున్నారు.

## ఎలివేటెడ్ కారిడార్లలో భూసేకరణకు ₹2300 కోట్లు

### క్షేత్రస్థాయిలో మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేసిన హెచ్ఎండీఏ

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరం నుంచి ఉత్తర తెలంగాణ వైపు నిర్మించ తలపెట్టిన రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక పనులు కొనసాగుతున్నాయి. సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ నుంచి తూంకుంట వరకు రాజీవ్ రహదారిపై, ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి మిలిటరీ డెయిరీ ఫామ్ వరకు నిర్మించే రెండు ఎలివేటెడ్ కారిడార్ల కోసం అవసరమైన స్థలాలను గుర్తించడంతో పాటు మార్కింగ్ పనులను పూర్తి చేశారు. రెండు ఎలివేటెడ్ కారిడార్లలో రక్షణ శాఖకు చెందిన భూములు ఉండటంతో వేర్వేరుగా, మిగతా భూములు ప్రజలకు చెందిన వాటిని గుర్తించారు. ఈ రెండు కారిడార్‌లలో కలిపి మొత్తం రూ.2300 కోట్ల వరకు ఆస్తుల సేకరణకే వ్యయం అవుతుందని హెచ్ఎండీఏ అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. ఇందులో సుమారు రూ.300 కోట్ల వరకు రక్షణ శాఖకు సంబంధించిన భూముల కోసం చెల్లించాల్సి ఉంటుంది. కాగా ప్రైవేటు ఆస్తుల సేకరణకు చెల్లించాల్సిన మొత్తాన్ని టీడీఆర్ లేదా నగదు రూపంలో ఇవ్వాల్సి ఉంటుందని, రెండు మార్గాల్లో మొత్తం ఆస్తుల గుర్తింపు పూర్తి చేసిన తర్వాత నోటీసులు జారీ చేస్తామని ఓ అధికారి తెలిపారు.

# తక్కువ ధరకే బంగారమంటూ కుచ్చుటోపీ

- ఘరానా ముఠా అరెస్ట్.. రూ. 51 లక్షల నగదు
- రూ. 6 కోట్ల నకిలీ నోట్లు,
- 5 కిలోల నకిలీ బంగారం స్వాధీనం

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): కస్టమ్స్ నుంచి కొనుగోలు చేసిన బంగారాన్ని తక్కువ ధరకు విక్రయిస్తున్నామని నమ్మించి వ్యాపారులకు కోట్ల రూపాయలు కుచ్చు టోపీ పెడుతున్న ముఠాను మేడిపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.51 లక్షల నగదు, రూ. 6.86 కోట్ల నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా వివరాలను మంగళవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ తరుణ్‌జోషి వెల్లడించారు. నెల్లూర్ జిల్లా కావలికి చెంది కర్రెద్దుల విజయ్‌కుమార్ బీటెక్ పూర్తి చేశాడు. తక్కువ ధరకు బంగారం విక్రయిస్తున్నామంటూ తమ ఊరిలో జరిగిన ఒక మోసం గూర్చి తెలుసుకొని తాను కూడా అలాగే మోసాలు చేయాలని ప్లాన్ చేశాడు. ఇందుకు తన స్వస్థలానికి చెందిన వృత్తిరీత్యా డ్రైవర్లైన బోగిరి సునీల్ గవాస్కర్ అలియాస్ హరీశ్, అడిగోపుల ఓమ్ సాయి కిరీటి, తెనాలికి చెందిన వ్యాపారి నంబూరి డేవిడ్ లివింగ్‌స్టోన్ అలియాస్ సెంథిల్‌తో ఒక ముఠాను ఏర్పాటు చేశారు. ప్రధాన నిందితుడైన విజయ్‌కుమార్‌పై కావలిలో 13 చీటింగ్ కేసులు, సెంథిల్‌పై రెండు కేసులు నమోదయ్యాయి, వీళ్లకు స్థానిక పోలీసులు వార్నింగ్ ఇవ్వడంతో మకాంను బెంగళూర్‌కు మార్చారు.

### నకిలీ బంగారాన్ని అంటకట్టి..

విజయ్‌కుమార్, డేవిడ్ లైవింగ్ స్టోన్ వ్యాపారుల వద్దకు వెళ్లి తక్కువ ధరకు బంగారం ఉందని చెబుతారు. తమ వద్ద ఉండే అసలైన 5 తులాల బంగారాన్ని రూ. 2 లక్షలకే విక్రయించి వ్యాపారుల నమ్మకాన్ని పొందుతారు. మేం కస్టమ్స్ నుంచి తక్కువ ధరకు బంగారాన్ని కొంటాం, మీకు కావాలంటే వారం రోజుల్లో కిలో, రెండు కిలోలు అందివ్వగలమంటూ నమ్మిస్తారు. వీళ్ల మాటలు నమ్మిన వ్యాపారులు అందుకు కొంత అడ్వాన్స్‌గా ఇచ్చి పంపిస్తారు. బంగారాన్ని మాత్రం బెంగళూరు, చెన్నైలో అందిస్తామంటూ నమ్మిస్తారు. అడ్వాన్స్ తీసుకున్న వాళ్లు బెంగళూర్‌కు వెళ్లిన సమయంలో మీ బంగారం రావడానికి ఇంకా వారం పడుతుందని, తక్కువ ధరకు మాట్లాడుకున్నట్లుగా పూర్తి మొత్తాన్ని ఇవ్వాలని అడుగుతారు. ఆ సమయంలోనే బోగిరి సునీల్ గవాస్కర్ అక్కడ హడావిడి చేస్తుంటాడు. మీకు మొత్తం డబ్బు ఇస్తున్నామంటూ నకిలీ నోట్ల కట్టలను అందజేసి కస్టమర్‌లా నటిస్తుంటాడు. అక్కడ భారీ ఎత్తున బంగారం వ్యాపారం నడుస్తుందనే బిల్డప్ ఇస్తారు. అక్కడకు వెళ్లిన కస్టమర్‌కు నమ్మకం మరింత కుదురుతుంది. చెప్పినట్లు కొన్ని రోజుల తరువాత అక్కడకు వెళ్లి బంగారం తీసుకుంటాడు. అయితే అతనికి అసలైన బంగారం ప్యాక్ చేసే కవర్లలోనే నకిలీ బంగారం ప్యాక్ చేసి, మొత్తం డబ్బులు వసూలు చేసుకొని పంపిస్తారు. కొద్ది దూరం వెళ్లగానే పోలీసు దుస్తుల్లో ఓమ్ సాయి కిరిటీ వచ్చి బంగారంతో వెళ్తున్న వారిని ఆపి వాహనాన్ని తనిఖీ చేస్తారు, మీరు అక్రమ దందా చేస్తున్నారని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తీసికెళ్లండంటూ ఆ నకిలీ బంగారాన్ని తీసుకొని అక్కడి నుంచి ఉడాయిస్తాడు. ఇలా వ్యాపారులను మోసం చేస్తున్నారు.

### నగరవాసికి రూ.1.1 కోట్లు.. టోకరా

బోడుప్పల్‌కు చెందిన శ్రీ దిలీప్ బార్ఫ వృత్తిరీత్యా వ్యాపారి. తన స్నేహితుడు సింగిరెడ్డి సురేశ్‌కు వచ్చిన సమాచారంతో మే 19న బెంగళూరు, టీసీ పాల్యకు వెళ్లి అక్కడ విజయ్‌కుమార్, సునీల్ గవాస్కర్‌ను కలిశారు. రూ. 6 లక్షలు తీసుకొని 101 గ్రాముల బంగారం ఇచ్చారు. దీంతో దిలీప్‌కు నమ్మకం కుదిరి 2 కిలోల బంగారం కోసం మొదట రూ. 20 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. వారం రోజుల తరువాత బెంగళూరుకు వెళ్లి విజయ్‌కుమార్‌ను కలిశాడు. ఆ సమయంలో 5 కిలోల బంగారం విక్రయిస్తున్నట్లు, కొన్నవాళ్లు డబ్బులు ఇస్తున్నట్లు అంతా నకిలీ బంగారం, నకిలీ నోట్లతో నాటకం చేశారు. ఈ నాటకం చూసి బాధితుడు నిజమని నమ్మాడు. దీంతో మిగతా రూ. 90 లక్షలు కూడా చెల్లించాడు. మీ స్టాక్ ఇంకా రాలేదు, మా మేనేజర్‌ను కలుద్దామంటూ చెన్నైకి తీసుకెళ్లి రాయల్ మెరిడియన్ హోటల్‌లో ఓ గదిని తీసుకున్నారు. సెంథిల్‌ను పరిచయం చేయగా, మీ బంగారం బంజారాహిల్స్‌లోని రోడ్డు నం.35లో మీరు కలెక్ట్ చేసుకోండి అంటూ అతడు సూచించాడు. ఆ తరువాత అక్కడి నుంచి బాధితుడు రాగానే ఈ ముఠా సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. ఆ తరువాత సెల్‌ఫోన్ ఆన్‌లో ఉన్నా ఫోన్లు లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి




పట్టుబడిన బంగారం వివరాలు వెల్లడిస్తున్న సీపీ తరుణ్‌జోషి

మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఈ ముఠాను పట్టుకొని విచారించి వివరాలు వెల్లడించారు. నిందితుల నుంచి రూ. 51 లక్షల అసలు నగదు, ఒక పోలీస్ కానిస్టేబుల్ యూనిఫామ్, మూడు ఖరీదైన కార్లు, రూ. 6.86 కోట్ల నకిలీ నోట్ల కట్టలు, 5 కిలోల నకిలీ బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి పాల్గొన్నారు.